సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం ; 10 ; జూలై ; 2023



భవనాల కొరత
బొమ్మలరామారం మండల పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాలకు పక్కా భవనాల కొరత ఏర్పడింది.
- 9లో



ఘనంగా బోనాల పండుగ
భూదాన్‌పోచంపల్లిలో ఆదివారం మద్దెలమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
34°/25°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న గణపతిరెడ్డి

బొమ్మలరామారం : గ్రామ పంచాయతీ కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తుందని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు గణపతిరెడ్డి అన్నారు. బొమ్మలరామారంలో పంచాయతీ కార్మికుల సమ్మెకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. జీఓ 60 ప్రకారం పెంచిన వేతనాలు అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొట్ట యాదమ్మ, నాయకులు ర్యాకల శ్రీశైలం,యాదగిరి, లక్ష్మికాంత్, జయమ్మ, అండమ్మ, బాలమణి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



యువకులకు బాల్ బ్యాడ్మింటన్ కిట్లు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : క్రీడల ద్వారా స్నేహభావం ఏర్పడుతుందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో యువకులకు ఆదివారం బాల్‌బ్యాడ్మింటన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లోనూ రాణించి జిల్లాకు పేరు తేవాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, పర్వతాలు, నర్సింగరావు, సీస శేఖర్, రేపాక మహేందర్, ఎండీ హబీబ్, తాటిపాముల రవి, కానుగు అనిల్ గౌడ్, బాల్ నర్సయ్య, ఆదర్శ్ గౌడ్, చంద్రమౌళి, వెంకటేష్, ఎండీ హైమద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మాదిరిగా పోస్టులివ్వాలి



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

భువనగిరి : ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎంఈఓ-1, ఎంఈఓ 2 పోస్టులు ఇవ్వాలని కోరుతూ జిల్లా గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి హైదరాబాదులో వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మేరోజు బ్రహ్మచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖలీల్ అహ్మద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉస్నాబాద్ రమేష్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాశం కృష్ణమూర్తి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి యాలాల కృష్ణారావు ఉన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు మెగా ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న భాస్కరాచారి

మోత్కూరు : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మోత్కూరుకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం సూరోజు భాస్కరాచారికి మెగా ఐకాన్ అవార్డు ప్రదానం చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు. భాస్కరాచారి రెడ్‌క్రాస్ సభ్యుడిగా, డైరెక్టర్‌గా 12 ఏళ్లుగా సేవలందిస్తున్నందుకు గుర్తింపుగా అవార్డు దక్కింది. ఇండియన్ రెడ్‌క్రాస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, డైరెక్టర్లు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, ఎస్.ఎన్.చారి, శ్రీనివాస్‌రెడ్డి, చేపూరి అనిల్ తదితరులు అభినందలు తెలిపారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం



శిల్పారామంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన భారీ స్వాగత తోరణం

రాయగిరి చెరువు చెంతన సిద్ధమవుతున్న మినీ శిల్పారామం

- ఆహ్లాదం పంచేలా బోటింగ్, ప్రత్యేక ఆకర్షణగా వాటర్ జెట్స్
- ఆకట్టుకునే హస్తకళా స్టాళ్లు, విభిన్న రుచులతో ఫుడ్ కోర్టు
- తుది దశకు చేరిన పనులు
- ఆగస్టులో ప్రారంభానికి సన్నాహాలు



శిల్పారామం నుంచి ప్లే గ్రౌండ్‌కు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వంతెన

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింస్వామి సన్నిధికి వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచేందుకు కొత్త వేదిక సిద్ధమవుతోంది. వైటీడీఏ పరిధిలో రాయగిరి చెరువు చెంతన ఏర్పాటు చేస్తున్న మినీ శిల్పారామం తుది మెరుగులు దిద్దుకుంటోంది. సుమారు రెండు ఎకరాల స్థలంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయి. చెరువు మధ్యలో ఐలాండ్, పక్కనే వంతెన, బోటింగ్, ఫౌంటేయిన్ సహా పర్యాటకులను ఆకట్టుకునేందుకు సకల హంగులతో సిద్ధమవుతోంది. పల్లె జీవనం ప్రతిబింబించేలా కులవృత్తులు, హస్తకళా స్టాళ్లు ఇక్కడ కొలువుదీరనున్నాయి.

శిల్పారామంలో చేపట్టిన నిర్మాణాలు ఇవీ..
మినీ శిల్పారామానికి వచ్చే భక్తులు, స్థానికులను ఆకట్టుకునేలా భారీ స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. మొదటి స్వాగత తోరణం 33 ఫీట్ల వెడల్పు, 40 ఫీట్ల ఎత్తు, లోపల రెండవ ఆర్చి 25 వెడల్పు, 15 ఫీట్ల ఎత్తులో నిర్మించారు. ఇక ఈ రెండు ఆర్చిల మధ్య భారీ షెడ్డు నిర్మిస్తున్నారు. ఇందులో రెండు వైపులా నాలుగు స్టాళ్లు, ఓపెన్ కారిడార్, చేతితో తయారు చేసిన బొమ్మలు, ఇతర సామగ్రి రానున్నాయి. ఈ షెడ్డులోనే మొదటి అంతస్తులో డైనింగ్ హాల్, బాల్కనీ, చెరువు, కొండలు, చెట్టు ఏర్పాటు చేశారు. భక్తులకు, పర్యాటకులకు మంచినీరు అందించేలా జలప్రసాదం సిద్ధం చేశారు.

బోటింగ్, సైక్లింగ్
పెద్దలు, చిన్నారులు సంతోషంగా గడిపేందుకు చెరువు దిగువ భాగంలో అలుగు వద్ద బోటింగ్, సైకిలింగ్ (ఫెడరల్ బోటింగ్) ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేశారు. ఇందులో జారుడుబండ, రంగుల రాట్నం, తూకం వంటి ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ప్లే గ్రౌండ్ పక్కనే ఉన్న భారీ మర్రి వృక్షాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఆ చెట్టుకు జూలలు (ఊయలలు) బిగిస్తున్నారు. శిల్పారామం కార్యాలయం, స్టాళ్ల నుంచి చిన్నారుల ప్లే గ్రౌండ్‌కు వెళ్లడానికి ఇనుప వంతెన ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా బాహుబలి ఏనుగు, గుర్రం, ఎద్దుల బొమ్మలు
ఏనుగు, గుర్రం, బాహుబలి ఎద్దుల బొమ్మలు పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి. వీటిని హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఫైబర్‌తో ప్రత్యేకంగా తయారు చేయించి తీసుకువచ్చారు. వీటితో పాటు ఒడిశా నుంచి 10 భారీ రాతి శిల్పాలు (స్యాండ్ స్టోన్ శిల్పాలు) తీసుకువచ్చారు.

చేతి వృత్తిదారులకు ఉపాధి
మినీ శిల్పారామం ద్వారా చేతి వృత్తిదారులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేసే విధంగా చేతి వృత్తుల ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా చేనేత హస్త కళాకారులతో తయారు చేసిన దుస్తువులు, చెక్క బొమ్మలు, ఇతర కళాకారులు రూపొందించిన బొమ్మల స్టాళ్లు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించనున్నారు.

ఆగస్టు రెండవ వారంలో ప్రారంభం
మినీ శిల్పారామాన్ని ఆగస్టు రెండవ వారంలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వైటీడీఏ అధికారులు పనుల్లో వేగం పెంచారు.



బాహుబలి గుర్రం, ఎద్దుల బొమ్మలు

కనువిందు చేసేలా వాటర్ జెట్స్



పర్యాటకులను ఆకర్షించేందుకు చెరువులో వాటర్ జెట్స్ ఏర్పాటు చేశారు. వీటి నుంచి నీరు వివిధ రంగులు, ఆకారాల్లో సుమారు 40 ఫీట్ల ఎత్తుకు ఎగిసిపడుతూ ఆకట్టుకోనున్నాయి. వాటర్ జెట్స్‌ను పలుమార్లు ట్రయల్ రన్ చేశారు.

ఆకర్షణీయమైన మొక్కలు, లాన్



ఆహ్లాదం పంచేందుకు గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు. లాన్‌తో పాటు వివిధ రకాల మొక్కలు నాటుతున్నారు. రాత్రివేళల్లో ఆకర్షణీయంగా కనిపించేలా విద్యుత్ లైట్లతో అలంకరించనున్నారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



దర్శనం కోసం క్యూ లైన్‌లో నిల్చున్న భక్తులు

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాల భోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన గావించి తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడుసేవలు, ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

- వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

భువనగిరిటౌన్ : విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివారం భువనగిరిలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రైవేట్ విద్యా సంస్థలు పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నా నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. మన ఊరు – మన బడి పనులు మొక్కుబడిగా సాగుతున్నాయన్నారు. సమస్యలు పరిష్కరించాలని బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అభిలాష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మామిడాల ప్రవీణ్‌తో పాటు సంఘాల నాయకులు వట్టిపల్లి శివ, ఎండీ నేహాల్, ఈర్ల కార్తీక్, రాజబోయిన రవి, యువ కిషోర్‌రెడ్డి, గణేష్, అఖిల్ పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి రాజీనామా చేసి గెలవాలి

- గుండాల సర్పంచ్‌కు బీఆర్ఎస్ నాయకుల సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గుండాల : బీఆర్ఎస్ తరఫున గెలిచిన గుండాల సర్పంచ్ చిందం వరలక్ష్మికి గొంగిడి దంపతులపై విమర్శలు చేసే అర్హత లేదని, దమ్ముంటే సర్పంచ్ పదవికి రాజీనామా చేసి గెలవాలని ఆ పార్టీ నాయకులు సవాల్ విసిరారు. ఆదివారం గుండాలలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ తరఫున గెలుపొంది నాలుగున్నర సంవత్సరాలు సర్పంచ్ పదవి అనుభవించిన అనంతరం పార్టీకి రాజీనామా చేయడం చేయడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామాభివృద్ధికి పాటు పడతారని గెలిపిస్తే అవతలి పార్టీకి అమ్ముడు పోయి రాజీనామా చేశావని, ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నీ బిడ్డ పెళ్లికి ఆలేరు ఎమ్మెల్యే ఆర్థికంగా సహకరించిన విషయం మరిచి ఆమెను విమర్శించడం ఎంతవరకు సమంజసమన్నారు. గ్రామంలో ఆలయాలకు దాతలు ఇచ్చిన డబ్బులు కాజేసిన వ్యక్తి ఎమ్మెల్యేను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించబోమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గిరికత్తుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు మాదరబోయిన రాంమల్లు, అన్నెపర్తి భిక్షం, ఎండీ అబ్బాస్, అన్నెపర్తి నర్సింహ, సుగుణ, రాజు, నల్ల యాదయ్య, అనిల్, చాగంటి ఎల్లయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో దేశానికి ఒరిగిందేమీ లేదు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



విలేకరులతో మాట్లాడుతున్న విప్ సునీత

రాజాపేట : బీజేపీ పాలనలో దేశ ప్రజలకు ఒరిగిందేమీ లేదని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. ఆదివారం రాజాపేటలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రజలు అభివృద్ధి చెందలేదని, కేవలం కార్పొరేట్ కంపెనీలు మాత్రమే లాభపడ్డాయన్నారు. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీని గుజరాత్ ఎందుకు తరలించారో చెప్పాలన్నారు. దేశంలో తెలంగాణ భాగమేనని, రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం వివక్ష చూపుతుందని ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గగా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ గోపాల్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఉపేందర్, మదర్ డెయిరీ డైరెక్టర్ వెంకట్ రాంరెడ్డి, నాయకులు భాస్కర్ గౌడ్, వీరేశం, జశ్వంత్, వెంకటేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, గజ్జెల రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై చేరికలు

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

భువనగిరి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకష్ణారెడ్డి అన్నారు. ఆదివారం వివిధ పార్టీలకు చెందిన సుమారు 500 మంది భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. మన పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన అంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ జిట్ట వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పెంట నరసింహ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

రామన్నపేటకు మహర్దశ!

- ప్రధాన రోడ్డు పనులు ప్రారంభం
- నాలుగు లేన్లుగా విస్తరణ
- పూర్తయితే తీరనున్న రవాణా ఇబ్బందులు



రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న కల్వర్టు

రామన్నపేట : మండల కేంద్రంలో చిట్యాల – భువనగిరి రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. రామన్నపేట పరిధిలో రూ 8.50 కోట్ల వ్యయంతో నాలుగు లేన్లుగా రహదారిని విస్తరిస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే రామన్నపేట రూపురేఖలు మారి పట్టణ శోభను సంతరించుకోనుంది.

ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రమైనా అభివృద్ధికి నోచని పేట
నియోజకవర్గం, తాలుకా కేంద్రం, మున్సిపాలిటీగా వెలుగొందిన రామన్నపేట అభివృద్ధికి నోచుకోలేదు. ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రభుత్వ భూములు ఉండడంలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు లేక వాణిజ్యపరంగా వెనుకబడింది. 1995లో డిగ్రీ కళాశాల కార్పస్‌ఫండ్ కోసం సుభాష్ రోడ్డు వెంట గల గ్రామ పంచాయతీ స్థలాన్ని వేలంలో విక్రయించడం వల్ల దుకాణాల సముదాయాల నిర్మాణానికి బీజం పడింది. 2008లో ఆస్పత్రి, గెస్ట్‌హౌజ్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలతో పట్టణ రూపురేఖలు కొంత వరకు మారాయి. ప్రస్తుతం ప్రధాన రహదారి విస్తరణ పూర్తయితే మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంది.

రూ.8.50 కోట్ల వ్యయంతో పనులు
రామన్నపేటలో 35/6 కి.మీ నుంచి 37 కి.మీ వరకు చిట్యాల – భువనగిరి రోడ్డు, సుభాస్ సెంటర్ నుంచి 0.5 కి.మీ వరకు అమ్మనబోలు రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించుటకు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.8.50 కోట్లు మంజూరయ్యాయి. అధికారులు టెండర్ పిలిచి పనులు ప్రారంభించారు. విస్తరణకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించుటకు టెండర్లు నిర్వహించారు.విద్యుత్ లైన్లను మారుస్తున్నారు. రోడ్డు వెంట నిర్మాణాలను నిబంధనల మేరకు తొలగించడానికి మార్కింగ్ చేశారు.

విస్తరణ ఇలా..
రోడ్డు మధ్యలో 2 మీటర్ల వెడల్పుతో డివైడర్ ఏర్పాటు చేసి ఇరుపక్కలా 7మీటర్ల వెడల్పుతో నాలుగురోడ్ల రహదారి (బీటీ పోర్షన్) నిర్మించనున్నారు.బీటీ తరువాత ఇరు వైపులా 2 మీటర్ల వెడల్పుతో మట్టితో షోల్డర్స్ ఏర్పాటు చేస్తారు. అదే విధంగా మెయిన్ రోడ్డుపై వరదనీరు వెళ్లడానికి ఐదు చోట్ల పైప్ కల్వర్టులు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. పెద్దమోరీ వద్ద 4 తూములు, మిగిలిన నాలుగు చోట్ల ఒక్కో తూము ఏర్పాటు చేయనున్నారు.

పోలీస్ స్టేషన్ వరకు డ్రెయిన్ నిర్మించాలి



సినిమా థియేటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరుపక్కలా డ్రెయిన్ సౌకర్యం లేదు. మురుగు, వర్షపు నీరు దిగువకు వెళ్లడానికి వీలుగా డ్రెయిన్ నిర్మించాలి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాత థియేటర్ నుంచి పెద్దమోరీ వరకు లేదా హాస్పిటల్ ఈశాన్యంలోని మురుగు కాల్వ వరకు డ్రెయిన్ నిర్మించాలి.
–ఎస్‌కే చాంద్, రామన్నపేట

ప్రజలు సహకరించాలి



రోడ్డు విస్తరణ కోసం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పట్టుబట్టి నిధులు మంజూరు చేయించారు. నిధుల సాధనతో పాటు పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలి.డివైడర్ మధ్యలో సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటు చేస్తారు.పనులు పూర్తయితే రామన్నపేట రూపురేఖలు మారిపోతాయి.
– పున్న లక్ష్మీజగన్‌మోహన్, జెడ్పీటీసీ, రామన్నపేట

పనులు ముమ్మరంగా సాగుతున్నాయి



రోడ్డు విస్తరణలో భాగంగా కల్వర్టుల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులు చేపడతాం. రోడ్డువెంట ఉన్న చెట్ల తొలగింపునకు టెండర్లు పూర్తయ్యాయి.విద్యుత్‌కు సంబంధించిన పనులను ఆశాఖ అధికారులు చేపడతారు. నెలరోజుల్లో పనులు తుదిదశకు చేరుకుంటాయి.
– రాజశేఖర్, ఏఈ, ఆర్అండ్‌బీ, రామన్నపేట

అండర్‌పాస్, సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేయాలని ధర్నా

భువనగిరి : పగిడిపల్లి వద్ద అండర్‌పాస్‌తో పాస్‌తో పాటు యూటర్న్ సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం గ్రామానికి చెందిన యువకులు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అండర్‌పాస్, సిగ్నల్ పాయింట్ లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, వ్యవసాయ భూములు, దేవాలయాలు, వాటర్‌ప్లాంట్ దగ్గరకు వెళ్లాలంటే రోడ్డు క్రాస్ చేయవలసి వస్తుందన్నారు.ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దీంతో పాటు సర్వీస్ రోడ్డు కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



పగిడిపల్లి వద్ద ధర్నా చేస్తున్న గ్రామ యువకులు

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాము

త్రిపురారం: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన త్రిపురారం మండలం వస్త్రాంతండా గ్రామపంచాయతీ పరిధిలోని గుడితండాలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ సర్పంచ్ నగార గౌతమి తెలిపిన వివరాల ప్రకారం.. గుడితండాకు చెందిన నగార రాంబాబుకు వ్యవసాయంతో పాటు పశువులు కూడా ఉన్నాయి. పశువుల మేత కోసం తన ఇంటి గోడ వెంట ఏర్పాటు చేసిన గడ్డివాము ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. తండా వాసులు గమనించి నీళ్లతో మంటలను ఆర్పారు. గడ్డివాముకు ఆనుకొని ఉన్న కిటికీలోంచి షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు రవ్వలు ఎగిరిపడి మంటలు చెలరేగినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.30వేలు పెట్టి కొన్న గడ్డి కాలిపోయిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని విష్ణుపురం రైల్వే స్టేషన్ సమీపంలో సికింద్రాబాద్-గుంటూరు రైల్వే మార్గంలో ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైలు నుంచి జారిపడి మహిళ మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలి వయస్సు 35ఏళ్లకు పైన ఉంటుందని, కుడి చేతి మణికట్టుపై మేఘరాజ్ పేరుతో పచ్చబొట్టు ఉందన్నారు. పంజాబీ డ్రెస్ ధరించి క్రీమ్ కలర్ టాప్, గ్రీన్ కలర్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. తల భాగం నుజ్జునుజ్జు కాగా మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఏఎస్‌ఐ నాగరాజు పేర్కొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



ఘటనా స్థలంలో వెంకన్న మృతదేహం

నాగారం: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన నాగారం మండలంలోని పసునూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పసునూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు చిత్తలూరి వెంకన్న(50) రోజుమాదిరిగానే ఆదివారం సాయంత్రం కల్లు గీయడానికి గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కుటుంబం కుల బహిష్కరణ

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాపురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తుడు దుస్సా వెంకటేశ్వర్లు గ్రామంలోని చేపల చెరువు మత్స్యకార సంఘంలో సభ్యుడిగా ఉన్నాడు. చేపల లావాదేవీల విషయంలో తేడాలు రావడంతో ముదిరాజ్ కులస్తులు ఆయన్ని 15రోజుల కిందట కుల బహిష్కరణ చేశారు. అయితే తనను కుల బహిష్కరణ చేసిన విషయం ఈ నెల 2వ తేదీన తెలిసిందని బాధితుడు పేర్కొన్నాడు. తనను శుభకార్యాలకు ఆహ్వానించిన వారికి రూ.2వేల చొప్పున జరిమానా కూడా విధించారని, తన కుటుంబంతో ఎవరూ మాట్లాడవద్దని, ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని తీర్మానం కూడా చేసినట్లు బాధితుడు వాపోయాడు. దీనిపై గ్రామ పెద్దలు కూడా పట్టించుకోకపోవడంతో బాధితుడు నడిగూడెం పోలీసులను ఆశ్రయించాడు. అధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

- కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వారి వద్ద నుంచి 15కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి

కేతేపల్లి: ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఆదివారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 15కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నకిరేకల్‌లోని శాలిగౌరారం సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన సీసఉర్దాబ్(23), ఖిల్లా జగత్రే(23), కర్ణ మడ్కామి అలియాస్ కర్ణ(20), మాస కొబాసి(27) ఒక ముఠా



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, వెనుక నిందితులు

గా ఏర్పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణా చేయటం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ నెల 7వ తేదీన ఈ నలుగురు కలిసి ఒడిశాలోని తమ గ్రామాలకు సమీపంలో ఉన్న అడవుల్లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి రూ.3వేలకు కిలో చొప్పున 15కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని హైదరాబాద్‌కు తరలించి అక్కడ కిలో రూ.20వేలకు అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన గంజాయిని 5కిలోల చొప్పున మూడు ప్యాకెట్‌లలో కట్టి లారీలో ఆంధ్రప్రదేశ్ మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరారు. పక్కా సమాచారం అందుకున్న కేతేపల్లి పోలీసులు జిల్లా ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు కేతేపల్లి మండల పరిధిలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీలో ప్రయాణిస్తున్న ఈ నలుగురు ముఠా సభ్యులు పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నిజం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3లక్షల విలువైన 15కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్‌లను కేతేపల్లి తహసీల్దార్ ఎన్. మధుసూధన్‌రెడ్డి సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ముఠాను పట్టుకున్న పోలీసులను డీఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో శాలిగౌరారం సీఐ రాఘవరావు, కేతేపల్లి ఎస్‌ఐ బి. శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది అంజాద్, జానయ్య, మహేష్, రాకేష్, సురేష్, జనార్దన్, రమేష్ పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- ఉద్యమ సహచరుడికి కన్నీటి వీడ్కోలు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): తనతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేసిన ఆత్మకూరు (ఎస్) మండలం బొప్పారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత పగడాల కృష్ణారెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణారెడ్డి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. బొప్పారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలకు మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరై కృష్ణారెడ్డి భౌతికకాయాన్ని చూసి కంటతడి పెట్టుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో తన వెంట నడిచిన కృష్ణారెడ్డి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర గీత



కృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

కార్మికుల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, ఎంపీపీ స్వర్ణలతాచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూడి నర్సింహారావు, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, బీసీ సెల్ మండల ప్రెసిడెంట్ బ్రహ్మంగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న రెండు లారీలు పట్టివేత

గరిడేపల్లి: అక్రమంగా ధాన్యం తరలిస్తున్న రెండు లారీలను గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో పోలీసుల సహకారంతో సివిల్ సప్లయ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. వివరాలు.. గడ్డిపల్లిలోని శ్రీహనుమాన్ శివసాయి రైస్ మిల్లుకు ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మిల్లు నిర్వాహకులు స్థానికంగా ఓ పాలంలో నిల్వ చేశారు. ఆ ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం పోలీసుల సహకారంతో సివిల్ సప్లయ్ అధికారులు దాడి చేసి రెండు లారీలను సీజ్ చేశారు. ఈ విషయంపై సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మిని వివరణ కోరగా.. ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ధాన్యాన్ని తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నామని తెలిపారు. సోమవారం టెక్నికల్ టీం ద్వారా శాంపిల్స్ సేకరించి పంచనామా నిర్వహించి మిల్లు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని ఆమె పేర్కొన్నారు.

చందంపేటలో పీడీఎస్ బియ్యం..

చందంపేట: ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం చందంపేట మండలంలోని గన్నెర్లపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండల పరిధిలోని మూడుదండ్ల గ్రామానికి చెందిన దామెర శ్రీను గన్నెర్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో 5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఇంటిపై దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్న ధాన్యం లారీలు

ఒంటరితనం భరించలేక వృద్ధురాలు ఆత్మహత్య

కొండమల్లేపల్లి: ఒంటరి జీవితంతో విసుగు చెందిన ఓ వృద్ధురాలు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన బోడ మల్లమ్మ(75) భర్త 50 ఏళ్ల క్రితం, కుమారుడు 30 ఏళ్ల క్రితమే చనిపోయారు. దీంతో ఆమె ఒంటరిగా జీవిస్తోంది. ఒంటరితనాన్ని భరించలేక ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్‌ఐ వీరబాబు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

గరిడేపల్లి: లారీ ఢీకొని బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతిచెందిన ఘటన గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన పోలగాని సాయి(24) హుజూర్‌నగర్‌లోని శ్రీనివాస బైక్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో పని చేస్తున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం సాయి ఆదివారం తన స్నేహితుడు పిసం శంకర్‌తో కలిసి బైక్‌పై కీతవారిగూడెం వెళ్లి తిరిగి వస్తుండగా రాయినిగూడెం గ్రామ శివారులోకి రాగానే బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ టైర్లు సాయి తల పైనుంచి వెళ్లడంతో



సాయి (ఫైల్)

అతడు అక్కడికక్కడే మృతిచెందగా.. బైక్‌పై వెనుక కూర్చున్న శంకర్ పక్కనే ఉన్న పొలాల్లో ఎగిరి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సాయి రెండేళ్ల క్రితం రాయినిగూడెం గ్రామానికి చెందిన దివ్య అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, 9 నెలల బాబు ఉన్నారు. విషయం తెలుసుకున్న గరిడేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విధులు నిర్వహిస్తూ అపస్మారక స్థితిలోకి ఉద్యోగి

- యాదాద్రి ఆలయంలో ఘటన

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రచార శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఆదివారం ఉదయం ఉన్నట్టుండి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానిక ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ ప్రచార శాఖలో విధులు నిర్వహించే వెంకటేష్ రోజుమాదిరిగా ఆదివారం ఉదయం సుమారు 10.10గంటల సమయంలో ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆలయాధికారులు, సిబ్బంది గుర్తించి 108 వాహనంలో వెంకటేష్‌ను భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గుండె పక్క భాగంలో నొప్పి రావడంతో కిందపడిపోయినట్లు వెంకటేష్ వైద్యులకు చెప్పాడని 108 వాహన సిబ్బంది వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆలయ ఉద్యోగులు తెలిపారు.



108 వాహనంలో వెంకటేష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న సిబ్బంది

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- మరో ముగ్గురికి గాయాలు

భువనగిరి: కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందాడు. ఇదే ప్రమాదంలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి భువనగిరి మండల పరిధిలోని ముస్తాలపల్లి గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం అనాజీపురం గ్రామానికి చెందిన కొల్లు రామకృష్ణ (32), బుజిలాపురం గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు నర్సింహతో కలిసి బైక్‌పై భువనగిరి మండలంలోని రాయగిరి నుంచి మోత్కూరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి మండల పరిధిలోని ముస్తాపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా నర్సింహకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న భువనగిరి పట్టణానికి చెందిన డొప్ప రమేష్, అతడి తల్లి సత్తమ్మను కూడా ఢీకొట్టడంతో వారిద్దరికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరిలో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గాయాలైన వారిని కూడా అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ సతీష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారం గ్రామానికి చెందిన షేక్ అఫ్రిద్(23) ఈ నెల 6వ తేదీన గడియగౌరారం నుంచి చింతపల్లికి బైక్‌పై వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో అదుపు తప్పి బైక్ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. అఫ్రిద్ తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం మాల్‌లోని పీపుల్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తల్లి షేక్ సాధికాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అఫ్రిద్ (ఫైల్)

ఇంటి పైనుంచి జారిపడి..

చౌటుప్పల్: ఇంటి పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన జక్కల లక్ష్మణ్(42) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఇంటి నిర్మాణ పనుల్లో ఉండగా శనివారం మొదటి అంతస్తు రేలింగ్ వద్ద నుంచి జారిపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ధనుంజయ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

డిండి: వ్యవసాయ భూమి పంపిణీ విషయంలో చోటు చేసుకొన్న ఘర్షణలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం డిండి మండలం ఎర్రారం గ్రామపంచాయతీ పరిధిలోని జాల్‌తండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జాల్‌తండాకు చెందిన రాత్లావత్ జగన్, లక్ష్మ, పత్యా, హర్యాకు అదే గ్రామానికి చెందిన వర్గం, గాంసీరాం, దుద్యా, బుద్యా మధ్య గత కొన్నిరోజులుగా భూమి చాయితీ జరుగుతోంది. ఆదివారం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా ఒక వర్గంపై మరో వర్గం దుర్భాషలాడుతూ దాడి చేసుకున్నారు. దీంతో పంచాయితీ పెద్దగా వ్యవహరిస్తున్న మాజీ ఎంపీపీ రాత్లావత్ వెంకట్రాంతో పాటు మరో ఇద్దరి వ్యక్తులకు గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిగూడ: మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరివంగి శ్రీనివాస్ మర్రిగూడ నుంచి రాంరెడ్డిపల్లి గ్రామానికి శనివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలో అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మర్రిగూడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని హస్తినాపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్‌ను పరామర్శించారు. వైద్య ఖర్చులను తానే భరిస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట బేత వెంకటేష్, ఏరుకొండ రాము ఉన్నారు.

బైక్ అదుపుతప్పి గాయాలు..

కేతేపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బర్లపెంట బజారుకు చెందిన అక్కెనపల్లి జానయ్య ఆదివారం సాయంత్రం నకిరేకల్ నుంచి బైక్‌పై సూర్యాపేటకు బయల్దేరాడు. ఈ క్రమంలో కేతేపల్లిలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే బైక్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న జానయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ దుర్మరణం

మునగాల: మండలంలోని మొద్దులచెరువు శివారులో ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై రెండు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి సూర్యాపేట వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టి రోడ్డు మధ్యలో ఆగిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి మరో సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక నుంచి ఢీకొట్టిన లారీ క్యాబిన్‌లో డ్రైవర్ గోపి(40) ఇరుక్కుపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో క్యాబిన్‌లో నుంచి డ్రైవర్‌ను బయటకు లాగారు. డ్రైవర్ గోపికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందినట్లు ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

పెద్దవూర: తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి విమర్శించారు. ఆయన తనయుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి గత నెల 14వ తేదీన చేపట్టిన గిరిజన చైతన్య యాత్ర నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని 109 తండాల మీదుగా 208 కిలోమీటర్లు పూర్తి చేసుకుని పెద్దవూర మండలంలోని చింతపల్లితండాలో ఆదివారం ముగిసింది. ఈ యాత్ర ముగింపు సభకు జానారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం తెచ్చింది, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నలభై ఏళ్లయినా పూర్తి చేయలేరని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 170 గిరిజన తండాలకు కరెంట్‌ను ఇచ్చింది తానే అని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే అని, అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, పేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణం వంటి హామీలు అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, చంద్రారెడ్డి, వినయ్‌రెడ్డి, పబ్బు యాదగిరి, గౌనీ రాజారమేష్, బైకాని లక్ష్మయ్య, ఆంజనేయులు, వంశీ, చామల సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కుందూరు జానారెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు..

బీఆర్ఎస్ పార్టీకి చెందిన పెద్దవూర మండలంలోని చింతపల్లి గ్రామ ఎంపీటీసీ జటావత్ జ్యోతికృష్ణ, తిరుమలగిరి సాగర్ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పుట్నూరు రాజశేఖర్‌రెడ్డితో పాటు చింతపల్లితండాకు చెందిన వంద మందికి పైగా ఆదివారం రాత్రి జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి జానారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విత్తనశుద్ధితో తెగుళ్లు అదుపు

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు



నడిగూడెం : ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభంకావడంతో రైతులు సాగు పనులు మొదలుపెట్టారు. ఈ సమయంలో బోర్లు, బావుల క్రింద వరి నార్లు పోసుకోవడం, కంది, పెసర, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలు సాగు చేస్తుంటారు. రైతులు విత్తనశుద్ధి చేస్తే తెగుళ్లు అదుపులో ఉంటాయని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు తెలిపారు. విత్తనశుద్ధికి సంబంధించిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..



పెసర విత్తనశుద్ధి చేస్తున్న రైతు

- **వరిలో విత్తనశుద్ధి:** మెట్ట నారు మడులకు అయితే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దమ్ము చేసిన నారుమడైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజమ్‌ను కలిపి ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి తరువాత 24 గంటలు మండెకట్టి మొలకలను దమ్ము నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు మందు ద్రావణం సరిపోతుంది.
- **మొక్కజొన్నలో:** కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరం, లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసినట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు. బూజు తెగులు ఆశించు ప్రాంత రైతులు కిలో విత్తనానికి 4 గ్రాముల మెటలాక్సిల్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- **కందిలో:** మొదటగా విత్తనాలకు థైరమ్ లేదా కాప్టాన్ ఒక కిలో విత్తనానికి 3 గ్రాముల చొప్పున పట్టించాలి. ఆ తర్వాత విత్తుకొనే ముందు 200 నుంచి 400 గ్రాముల రైజోబియంను ఎకరం విత్తనానికి కలిపి విత్తుకోవాలి.
- **పెసరలో:** కిలో విత్తనానికి 30 గ్రాముల కార్బోసల్ఫాన్ మందును వాడి విత్తనశుద్ధి చేయాలి. కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేక 5 గ్రాముల థయోమిథాక్సమ్ కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే సుమారు 15 నుంచి 20 రోజుల వరకు రసం పీల్చు పురుగుల బారి నుంచి రక్షించుకోవచ్చు.
- **ఆముదంలో:** కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ పొడి మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఇలా చేయడం వలన మొలక కుళ్లు తెగులు, ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు మరియు కొంతవరకు వడలు తెగులును అరికట్టవచ్చు. వడలు తెగులు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 3 గ్రాములు కార్బెండిజమ్ లేదా 10 గ్రాములు ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలి.
- **వేరుశనగలో:** కిలో విత్తనానికి 1.0 గ్రాము టెబ్యుకొనజోల్, 3 గ్రాముల మ్యాంకోజెబ్ పొడి మందును పట్టించాలి. కాండంను కుళ్లు తెగులు ఆశించే ప్రాంతాలలో కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేయాలి. వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 2 మి.లీ. ఇమిక్లోప్రిడ్ చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి.